గడువు దాటిన సిలిండర్‌తో ప్రమాదమే!

- అప్రమత్తతతో ప్రమాదం నివారణ
- గడువు తేదీపై అవగాహన తప్పనిసరి



రాజంపేట టౌన్ : మనం వినియోగించే ప్రతి వస్తువుకు కాలపరిమితి ఉంటుంది. అలాగే నిత్యం వంట గదిలో ఉపయోగించే గ్యాస్ సిలిండర్‌కు కూడా గడువు ఉంటుంది. అయితే ఈ విషయం చాలా మందికి తెలియదు. దాదాపు 90 శాతం మందికి పైగా ప్రజలు డెలివరీ బాయ్ గ్యాస్ సిలిండర్‌ను ఇంటికి తీసుకురాగానే కాలపరిమితిని చూడకుండానే ఇంటిలో పెట్టుకొని వాడుకుంటారు. గ్యాస్‌కు ఎక్స్‌పైరి తేదీని తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనావుందని అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు.

ప్రమాదకర వస్తువుల్లో గ్యాస్ ఒకటి

ఇళ్లల్లో ఉండే ప్రమాదకరమైన వస్తువుల్లో గ్యాస్ సిలిండర్ ఒకటి. అందువల్ల సిలిండర్ వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనావుంది. అందులో గ్యాస్ సిలిండర్ ఎక్స్‌పైరి డేట్‌ను గుర్తించాలి. సిలిండర్‌పై ఉండే రింగ్‌కు కింద భాగంలో మూడు ఇనుప బద్దెలు ఉంటాయి. వాటిలో ఒకదానిపై లోపలివైపు సిలిండర్ గడువు తేదీ ముద్రించివుంటుంది. అయితే సిలిండర్‌కు వేసి ఉన్న ఆంగ్ల అక్షరం, అంకెలు అవేంటోలే అని చాలా మంది పట్టించుకోరు. అయితే రింగ్‌కు కింద భాగంలోని బద్దెపై ఉన్న అక్షరాన్ని నాలుగు భాగాలుగా విభజించి ప్రతి మూడు నెలలకు ఒక ఆంగ్ల అక్షరం చొప్పున రాసివుంటుంది.

గడువు తీరితే ప్రమాదమే

గ్యాస్ సిలిండర్‌ను చాలా మంది నెలల తరబడి వాడకుండా నిల్వవుంచుతారు. అయితే సిలిండర్‌పై ముద్రించిన గడువు తేదీలోపు వాడటం ఎంతో ఉత్తమం. కాలం చెల్లిన సిలిండర్‌ను వాడితే ప్రమాదం సంభవించే అవకాశాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. డెలివరీ బాయ్ గ్యాస్ తీసుకొచ్చాక అది గడువు తీరినది అయితే డెలివరీ బాయ్‌కి చెప్పి ఆ సిలిండర్‌ను వెనక్కి పంపించేయాలి.

గడువు తీరిన సిలిండర్‌ను ఇలా గుర్తించవచ్చు

ప్రతి ఇంటిలో వంట చేసేందుకు గ్యాస్ సిలిండర్ వాడతారు. అయితే ఏజెన్సీ నుంచి గ్యాస్ సిలిండర్‌ను డెలివరీ బాయ్ తీసుకొచ్చినప్పుడు గడువు తేదీని గుర్తించాలి. గ్యాస్ సిలిండర్ పైభాగంలో ఉండే రింగు కింద గడువు తేదీ ముద్రించివుంటుంది. ఏడాదిలో 12 నెలలను నాలుగు భాగాలుగా విభజించి ఆంగ్లభాషలోని ఏ,బీ,సీ,డీ అక్షరాలను రాసివుంచుతారు. ఏ అక్షరం అయితే జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించినదని అర్థం. బీ అక్షరం అయితే ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించినది, అలాగే 'సీ' అక్షరం అయితే జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించినది. డీ అక్షరం అయితే అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించినదని గుర్తించాలి. ఉదాహరణకు బీ 25 అని ఉంటే ఆ సిలిండర్ ఈ ఏడాది ఏప్రిల్ నాటికి గడువు తీరుతుందని గుర్తించాలి. అదే సిలిండర్‌పై బీ 24 అని ఉంటే ఆ సిలిండర్ గత ఏడాది ఏప్రిల్ నాటికే గడువు తీరినదిగా గుర్తించాలి.

ఖాళీ సిలిండర్‌లకు గడువు

ఖాళీ సిలిండర్‌లకు నిర్దిష్ట కాలపరిమితి ఉంటుంది. అయితే ఇది వినియోగదారులకు సంబంధం లేదు. ఖాళీ సిలిండర్ కాలపరిమితి ఏడేళ్లు. తయారీదారులు తమ వద్ద రికార్డుల్లో లేని బ్యాచ్ నంబర్‌ల ప్రకారం ఏడేళ్లు దాటిన సిలిండర్‌లను డీలర్ల నుంచి వెనక్కు తెప్పించుకొని పరీక్షిస్తారు. ఏమాత్రం వినియోగ యోగ్యం కాని, నాణ్యత లేని సిలిండర్‌లను తయారీదారులు తుక్కుగా పరిగణించి పక్కన పెట్టేస్తారు.

విధిగా అవగాహన కలిగివుండాలి



ప్రస్తుతం చాలా మంది చిన్న వస్తువుకొన్నా ఎక్స్‌పైరి డేట్‌ను చూస్తారు. అయితే గ్యాస్ సిలిండర్ విషయంలో ఎక్స్‌పైరి డేట్‌ను పరిశీలించరు. అన్నింటికంటే గ్యాస్ సిలిండర్ గడువు తేదీ తెలుసుకునే విధానంపై విధిగా అవగాహన కలిగివుండాలి. అలాగే ఇంటికి గ్యాస్ సిలిండర్ వచ్చిన వెంటనే గడువు తేదీని పరిశీలించి సిలిండర్‌ను తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చు.

- కె.మాబు సుబహాన్, అగ్నిమాపక అధికారి, రాజంపేట

మాధవరం-1లో పోలీసుల నాకాబందీ



నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామంలో మంగళవారం ఉదయం పోలీసులు నాకాబందీ కార్యక్రమం నిర్వహించారు. ఒంటిమిట్ట సీఐ బాబు ఆధ్వర్యంలో సిద్దవటం ఎస్ఐ మహమ్మద్ రఫీ, సిబ్బంది గ్రామంలో ప్రతి ప్రాంతాన్ని సోదా చేశారు. గ్రామాల్లో వరుస చోరీలు జరుగుతుండటంతో వాటిని నియంత్రించేందుకు కార్డెన్ సెర్చ్ నిర్వహించి ప్రతి నివాస గృహాలను తనిఖీ చేసి వారి ఆధార్, రేషన్ కార్డు, డోర్ నెంబర్‌లను గుర్తించడానికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. గ్రామస్తులు ఎక్కడైనా వెళ్లినప్పుడు తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ద్విచక్ర వాహనదారులు ఎవరైనా వాహనాలకు నెంబర్ ప్లేట్ లేకుండా గ్రామాల్లో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట ఎస్ఐ శివప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

17న జాబ్ మేళా

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని బుడుగుంటపల్లిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈ నెల 17న నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ప్రముఖ కంపెనీలు పాల్గొని ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నివాళి



లక్షుమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట టౌన్ : మండలంలోని మదనగోపాలపురం ఎంపీటీసీ మధు మేనత్త మడగలం లక్షుమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మంగళవారం ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ రెడ్డయ్య, మల్లికార్జునరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మృతి



సానుగారి సుబ్బారెడ్డి

ఓబులవారిపల్లె : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సానుగారి సుబ్బారెడ్డి (75) అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతి చెందారు. దివంగత వైఎస్ రాజారెడ్డి హయాం నుంచి రాజకీయాల్లో ఉంటూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి సన్నిహితంగా ఉండేవారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో తిరుపతిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. మృతుని భార్య సానుగారి దేవి గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున మండల ఎంపీపీగా పనిచేయగా, వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని స్వగృహంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రైల్వే బ్రిడ్జి పరిశీలన

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరులో నిర్మాణ దశలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిని మంగళవారం డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్ కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సీహెచ్ రమేష్‌లు పరిశీలించి కాంట్రాక్టర్‌కు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ మార్కెట్ యార్డు, సమతా నగర్ నివాసులకు అండర్ బ్రిడ్జి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్, మహేష్, రమణ, అంజనేయులు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆసర్ల గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో ఆసర్ల గంగమ్మ

గాలివీడు : మండలంలోని ప్యారంపల్లి గ్రామంలో వెలసిన ఏటిగడ్డ ఆసర్ల గంగమ్మ జాతర మంగళవారం మైలు తిరునాలతో ముగిసింది. మహిమాన్విత శక్తి కలిగిన గ్రామ దేవతగా, పిలిస్తే పలికే దైవంగా కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఆసర్ల గంగమ్మను దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సోమవారం అర్ధరాత్రి విద్యుత్ వెలుగులతో అలంకరించిన చాందినీబండ్లు, కుంకుమ బండ్లు ఆలయ ప్రదక్షిణతో భక్తులకు కనువిందు చేయగా.. డప్పువాయిద్యాలు, కోలాటాలు, బాణసంచా పేలుళ్లు భక్తులను ఆకట్టుకున్నాయి. మంగళవారం ఉదయం మహిళలు బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. చివరిగా అసాధుని కథతో జాతరకు ముగింపు పలికారు.

వైభవం.. గ్రామోత్సవం



ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

రాజంపేట టౌన్ : శ్రీ రామనవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని అనేక ప్రాంతాల్లో సీతారాముల ఉత్సవ మూర్తులను వైభవంగా ఊరేగించారు. రాములోరి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొమ్మిదవ రోజు కావడంతో పలు గ్రామాల్లో అదే రోజు రాత్రి సీతారాముల కల్యాణ మహోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ మూర్తులను ఆయా గ్రామ ప్రజలు, భక్తులు పురవీధుల్లో ఊరేగించడంతో పాటు వసంతోత్సవాన్ని నిర్వహించారు. పదిరోజుల పాటు జరిగిన శ్రీరామనవమి ఉత్సవాలు మండలంలో ప్రశాంతంగా ముగిశాయి.

దారి సమస్యను తక్షణం పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దండువారిపల్లె రైతులు

రాయచోటి అర్బన్ : జిల్లాలోని తంబళ్లపల్లె మండలం ఎద్దులవారిపల్లె గ్రామం దండువారిపల్లెలో నెలకొన్న దారి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి ఎం.విశ్వనాథ, జిల్లా కమిటీ సభ్యుడు భీమవరం వెంకటేష్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దారి సమస్యలను పరిష్కరించాలంటూ మంగళవారం దండువారిపల్లె గ్రామస్తులతో కలసి కలెక్టరేట్ ఎదుట వారు ధర్నాను నిర్వహించారు. వారు మాట్లాడుతూ దండువారిపల్లెకు చెందిన వై.క్రిష్ణమ్మ, రమేష్‌రెడ్డిలు తమ పొలానికి అనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించారన్నారు. దీంతో గ్రామంలోని ప్రజలు పొలాల వద్దకు వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయాన్ని తంబళ్లపల్లె తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతోందన్నారు. వెంటనే జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని దారిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దండువారిపల్లెకు చెందిన రైతులు శంకరయ్య, మల్లికార్జున, కుమార్, సిద్దయ్య, శ్రీరాములుతో పాటు పలువురు పాల్గొన్నారు.

30 నుంచి మహాభారత యజ్ఞం



హరిహరాలయంలో సమావేశమైన మహాభారత యజ్ఞం కమిటీ సభ్యులు

రామాపురం : మండల కేంద్రంలో ఈ నెల 30వ తేదీ నుంచి 18 రోజుల పాటు మహాభారత యజ్ఞం నిర్వహిస్తున్నట్లు మహాభారత యజ్ఞం కమిటీ తెలిపింది. మంగళవారం మండల కేంద్రంలోని హరిహరాలయంలో మహాభారత కమిటీ సమావేశంలో యజ్ఞ నిర్వాహణకు కావాల్సిన ఏర్పాట్లు, తదితర విషయాలను చర్చించారు. మహాభారత యజ్ఞానికి 18 రోజుల పాటు మధ్యాహ్నం ఉచిత అన్నదానం ఏర్పాటు చేయడంతో పాటు మహాభారత యజ్ఞాన్ని మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు హరికథ రూపంలో రాత్రుల సమయంలో నాటకాల రూపంలోనూ ప్రదర్శన చేయనున్నట్లు పేర్కొన్నారు. మహాభారత యజ్ఞానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మహాభారత ఐక్య కమిటీ తెలియజేసింది. సమావేశంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రమేష్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ నాగభూషణ్‌రెడి అయోధ్యపురం ప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజారెడ్డి, రెడ్డప్పరెడ్డి, హరినాథ, వెంక్రామిరెడ్డి, దామోదర్ నాయుడు, భక్తవత్సలరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశు, వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, సుధాకర్‌రెడ్డి, నారాయణ, సుబ్బారెడ్డి, ఆంజనేయులురెడ్డి, పెద్దరెడ్డి, రామచంద్రారెడ్డి, శివారెడ్డి, రామస్వామి, ఆదెమ్మ, లక్ష్మయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఆప్కాస్‌లో కొనసాగించాలి



రాయచోటి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

రాయచోటి అర్బన్ : మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లోనే కొనసాగించాలని సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బి.వి.రమణ, రాయచోటి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు చెన్నయ్య, రాంబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులు కాదని, వారికి ప్రభుత్వ పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచడం సాధ్యం కాదని, గ్రాట్యుటీ వర్తించదంటూ రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ జారీచేసిన సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌తో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ఆప్కాస్ అనే సంస్థ ప్రభుత్వాధికారుల ఆధీనంలో నడుస్తున్న సంస్థ అన్నారు. కాగా ఆప్కాస్‌ను ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల కోసం ఏర్పాటు చేసినట్లు సాంకేతిక కారణాలను సాకుగా చూపుతూ చట్టబద్ధంగా అమలు కావలసిన గ్రాట్యుటీ పథకం అమలును నిరాకరించడం ప్రభుత్వ నిరంకుశ చర్యలకు నిదర్శనమన్నారు. కార్మికులకు టీఎల్ఎఫ్‌లోని 8 నెలల పెండింగ్ పీఎఫ్ బకాయిలు ఇవ్వాలన్నారు. డ్రైవర్లకు 36 జీఓలను అమలు చేసి వేతనం రూ.24,500లు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు నిరంకుశ పద్ధతులలో జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలంటూ వారు డిమాండ్ చేశారు. 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన ఒప్పందం ప్రకారం రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తో కూడిన పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపట్టవలసి వస్తుందంటూ వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సుండుపల్లె : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆర్‌హెచ్‌జీబీఎంఎస్ఎస్ సంస్థ కో-ఆర్డినేటర్ ముబారక్ సైబర్ మోసాలపై అవగాహనా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు, ఆర్థిక అక్షరాస్యత, పొదుపు ఎలా చేయాలో పొదుపు చేసినటువంటి డబ్బును తమ అవసరాలకు ఉపయోగించుకొని ఆర్థికంగా ఎలా బలపడాలో తెలియజేశారు. ప్రతి ఒక్కరూ చదువుకొని ఆర్థికంగా బలపడుతుంటే సమాజం బాగుపడుతుందని అలాగే దేశం బాగుపడుతుందని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పొదుపు గురించి అందరికీ అర్థమయ్యే రీతిలో కళాజాతర బృందంతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎం.బాబు, వెంకటయ్య, మండలంలోని అన్ని గ్రామాల నీటి సంఘం అధ్యక్షులు, టీసీ నెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్య కోర్సులతో ఆర్థిక ప్రగతి



వృత్తి విద్యలో శిక్షణను తీసుకుంటున్న విద్యార్థులు

రామాపురం : యువతలో వృత్తి విద్య నైపుణ్యాలను పెంపొందించి ఆర్థిక ప్రగతి దిశగా సాగేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కస్తూర్బా బాలికల ప్రిన్సిపల్ పుష్పలత అన్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి పథకంలో భాగంగా స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో శిక్షణ ఇస్తున్నారన్నారు. కోర్సు పూర్తి చేసుకున్న వారు సొంతంగా వ్యాపారం మొదలుపెట్టి ఆర్థిక అభివృద్ధికి బాటు వేసుకోవచ్చని ఆమె తెలియజేశారు.

కంకర దొంగలను వెనకేసుకురావడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : కంకర దొంగలను పట్టుకుని వారికి బుద్ధి చెప్పాల్సింది పోయి వారిని వెనుకేసుకొస్తూ ఆర్‌ఆర్ కుటుంబాన్ని విమర్శించే స్థాయికి దిగజారడం నీతిమాలిన చర్య అని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆర్‌ఆర్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మా నాయకుడు ఆర్.రమేష్ కుమార్ రెడ్డి రూ. 11 కోట్లు తీసుకోలేదని రాయచోటి వీరభద్రస్వామి గుడిలో ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఇది వరకే చెప్పారన్నారు. దీనికి ఎందుకు స్పందించలేదో అందరికీ తెలుసన్నారు. కూటమి ప్రభుత్వంలో జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గంలోని మండలాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేయలేకపోవడంతో మీ గ్రాఫ్ 30 శాతానికి పడిపోయిందని గుర్తించుకోవాలన్నారు. అనంతరం మాజీ ఎంపీపీ రెడ్డయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు అదనంగా వసూలు చేస్తూ రైతుల రక్తం పీలుస్తున్నారని మండిపడ్డారు. చెప్పుడు మాటలు విని నా ఇంటిపై, ఇంట్లో ఆడవాళ్లపై దాడి చేయించిన నువ్వు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అనంతరం కో - ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్ మాట్లాడుతూ కంకర దొంగలించిన మంత్రి అనుచరులపై కేసులుబనాయించాల్సిన పోలీసులు చోరీకి ఉపయోగించిన టిప్పర్, జేసీబీలను విడుదల చేయడం దుర్మార్గమన్నారు. జిల్లా ఎస్పీ చొరవ చూపి కంకర దొంగతనానికి పాల్పడిన నిందితులపై కేసు నమోదు చేసి చట్టం ఎవరి చుట్టం కాదనే సందేశాన్ని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సిద్దక రామచంద్రారెడ్డి, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, చెంద్రాయుడు, గడ్డం ప్రభాకర్ రెడ్డి, కేశవయ్య, ఎంపీటీసీ రమణమ్మ, మూగి శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ రాజేంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్ సిపి యూత్ నాయకులు కాలాడి వినయ్ కుమార్ రెడ్డి, మైనార్టీ నాయకులు చాన్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సుండుపల్లె : మండల పరిధిలోని మడితాడు యూనిట్‌లోని మడితాడు వీఓ, సీసీ రమణ గ్రామ సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో సీసీ రమణ ప్రభుత్వ పథకాలు, ఎస్సీలకు సున్నా వడ్డీ రాయితీ గురించి శ్రీనిధి అనంతరం యూనిట్ ఇన్‌చార్జ్ ఎస్.వెంకటయ్య పీఎండీఎస్ విధానం గురించి నవధాన్యాలు 20 నుంచి 30 రకాలు భూమిలో వేయడం వలన, సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది ప్రధాన పంటకు పోషణ అందిస్తాయన్నారు. అలానే కలుపు రాకుండా నివారించవచ్చునని, ప్రతి మహిళా సంఘం సభ్యురాలు తమ పొలాల్లో విధిగా నవధాన్యాలు వేసుకోవాలని సూచించారు. ఇందులో వీఓఏ నాగమునెమ్మ, గ్రామ సమాఖ్య, ఎస్‌హెచ్‌జీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో సంబేపల్లె

సంబేపల్లె : మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములతో కూడిన కురిసిన వర్షం కురిసింది. ఎండ వేడిమి కాస్త ఉపశమనం లభించింది అనుకునేలోపు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అర్ధరాత్రి అయినా కరెంట్ రాకపోవడంతో మండల కేంద్రం వాసులు తీవ్ర అవస్థలు పడ్డారు.

విధులకు వైద్యాధికారి డుమ్మా



పి.కొత్తపల్లి పీహెచ్‌సీలో వైద్యురాలు రాక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ

సిద్దవటం : మండలంలోని పి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి రంగలక్ష్మి మంగళవారం విధులకు డుమ్మా కొట్టింది. పి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉన్నప్పటికీ మంగళవారం డాక్టర్ శ్రీనివాసులరెడ్డి 104 వైద్య సేవల్లో వెలుగుపల్లిలో విధులు నిర్వర్తించారు. మరో డాక్టర్ రంగలక్ష్మి విధుల్లో లేక పోవడంతో డాక్టర్ ఎక్కడ అని వైద్య సిబ్బందిని విచారించగా ఆమెక కడప డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మీటింగ్‌లో ఉందని అన్నారు. రంగలక్ష్మి తరచూ విధులకు డుమ్మా కొడుతోందని, కడపలోని ప్రైవేటు క్లినిక్‌లో పనిచేస్తూ తన విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు తెలిపారు. ఈ విషయమై కడప డీఎంహెచ్‌ఓ నాగరాజును వివరణ కోరగా మంగళవారం తమ కార్యాలయంలో ఏ ఒక్క వైద్యాధికారికి కూడా సమావేశాన్ని ఏర్పాటు చేయలేదని డాక్టర్ రంగలక్ష్మి విధులకు రాకపోవడాన్ని విచారించి ఆమెపై తగు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

వ్యవసాయ సస్యరక్షణ పరికరాలు పంపిణీ



రైతుకు స్ప్రేయర్‌ను పంపిణీ చేస్తున్న ఏడీఏ నాగరాజ

సిద్దవటం : రైతులకు 50 శాతం సబ్సిడీపై వివిద రకాల వ్యవసాయ పనిముట్లు, సస్యరక్షణ పరికరాలు పంపిణీ చేసినట్లు బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయ సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ నాగరాజ మాట్లాడుతూ ప్రస్తుత రబీ సాగు పంటల స్థితిగతులు, రాబోవు ఖరీఫ్ - 2025 ప్రణాళిక, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల పంపిణీకి కార్యాచరణ, భూసార పరీక్ష ప్రణాళిక ప్రకృతి వ్యవసాయం అమలు ఫార్మర్ రిజిస్ట్రేషన్ విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీ ప్రతినిధి వంశీ శివఫణీంద్ర, రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

అవగాహన పెంచేలా.. ఆకట్టుకునేలా

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అధికారులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. రాయచోటిలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి (డీఎఫ్ఓ) పి.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో రాయచోటి స్టేషన్ అధికారి ఎం.వెంకట్రామిరెడ్డి తన సిబ్బందితో కలసి బంగ్లా సర్కిల్‌లో, రైల్వేకోడూరులోని రైల్వేస్టేషన్ వద్ద, చిట్వేలి రోడ్డు, ఆర్ఎస్ రోడ్డు తదితర ప్రాంతాలలో అగ్నిమాపక అధికారి విజయ్‌కుమార్ అగ్ని ప్రమాదాలను ఎలా నివారించాలనే అంశంపై ప్రదర్శన నిర్వహించారు. రాజంపేట పట్టణంలోని పాత బస్టాండులో ఫైర్ ఆఫీసర్ మాబు సుభాన్ నేతృత్వంలో నిర్వహించిన అగ్నిప్రమాద నివారణ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముందుగా అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధికారులు నిర్వహించిన డెమో ఆద్యంతం చూపరులను కట్టిపడేసింది. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు.

- రాజంపేట/రాయచోటి టౌన్/రైల్వేకోడూరు అర్బన్



రైల్వేకోడూరు అర్బన్: చిట్వేలి రోడ్డులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు



రాయచోటి టౌన్: బంగ్లా సర్కిల్ వద్ద ఆకట్టుకున్న డెమో ప్రదర్శన



రాజంపేట: పాతబస్టాండులో అగ్నిమాపకశాఖ నిర్వహించిన విన్యాసాలు